సాక్షి
అన్నమయ్య జిల్లా

ఆదివారం । 23 । మార్చి । 2025



ఆడుతూ...పాడుతూ చదివేద్దాం

ఒంటిపూట బడులు రానే వచ్చాయి. ఈ సమయంలో విద్యార్థులు దిన పత్రికలు చదవాలి. ఆదివారం అనుబంధం మ్యాగజైన్లలో ఫజిల్స్‌ను సాధన చేయాలి. -8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ ఆది॥ (సా॥)	సహర్ సోమ॥ (ఉ॥)
రాయచోటి	6.31	4.57
రాజంపేట	6.29	5.05
పీలేరు	6.30	4.54
మదనపల్లె	6.32	4.59

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.90	రూ.110
రెండోరకం	రూ.60	రూ.80

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 114 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

మద్దతు ధరపై కందుల కొనుగోలు

రాయచోటి జగదాంబసెంటర్: రాష్ట్ర ప్రభుత్వం నాఫెడ్ వారి ఆధ్వర్యంలో ఏపీ మార్క్‌ఫెడ్ జిల్లాలో కంది పండించిన, ఈ క్రాప్ చేయించుకున్న రైతుల నుంచి మద్దతు ధరపై ఒక క్వింటాల్ రూ.7,550 చొప్పున కందులు కొనుగోలు చేసేందుకు అనుమతి ఇచ్చిందని ఏపీ మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ త్యాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం నుంచి మదనపల్లె, ములకలచెరువు మార్కెట్‌యార్డుల్లో కందుల కొనుగోలు ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. రైతు సేవా కేంద్రంలో పేర్లు నమోదు నమోదు చేయించుకోవాలన్నారు. కేవలం ఈ క్రాప్ నమోదు చేసుకున్న రైతుల నుంచి మాత్రమే కొనుగోలు చేస్తామని, తేమశాతం 12 శాతం లోపల ఉండేలా చూసుకోవాలన్నారు. మరిన్ని వివరములకు 9052567983 నంబర్లలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

లేగ దూడల ప్రదర్శన



లేగదూడల ప్రదర్శన నిర్వహించిన పశువైద్యాధికారులు

సంబేపల్లి: మండల పరిధిలోని శెట్టిపల్లె పంచాయతీ వల్లబండపల్లె సమీపంలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో శనివారం లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి గుణశేఖర్‌పిల్లై మాట్లాడుతూ గడ్డిపెంచడం, గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు సకాలంలో పాడిపశువులకు వేయించుకోవాలన్నారు.వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని, పశు వైద్యుల సూచనలు పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యులు శ్రీధర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ నరసారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి టౌన్: జిల్లాలోని గిరిజన గురుకుల సంక్షేమ పాఠశాలలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి డి. సురేష్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని రాయచోటి, పీలేరు (కెవీపల్లెలో) ఉన్న బాలికల గురుకుల పాఠశాలలో 2025–2026కు సంబంధించి ఖాళీలు ఇలా ఉన్నాయి.

తరగతి	రాయచోటి	కెవిపల్లె (పీలేరు)
5	80	80
6	39	64
7	06	55
8	00	46
9	01	46

5వ తరగతికి సంబంధించి రిజర్వేషన్ ప్రకారం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. వీటిలో ఎస్టీలకు సంబంధించి (అన్ని తెగలకు చెందిన ఎస్టీలు)64, ఎస్సీ -10, బీసీ-04, ఇతరులు 2 మొత్తం 80 ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. పూర్వపు కడప విద్యార్థినిలు చేసుకోవాలన్నారు. దరఖాస్తులకు చివరి తేదీ ఈ నెల 25వ తేదీ. మరిన్ని వివరాల కోసం 94411 46908 / 73822 64994/ 94414 94161 నంబర్లలో సంప్రదించాలని చేయవల్సిందిగా డి. సురేష్ తెలిపారు.

క్షయవ్యాధిపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జిల్లా ఆరోగ్య విద్యాధికారి మహమ్మద్‌రఫీ

గుర్రంకొండ: క్షయవ్యాధి(టీబీ)పై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఆరోగ్య విద్యాధికారి మహమ్మద్‌రఫీ అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ తెలుగు జూనియర్ కళాశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు టీబీ , క్యాన్సర్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ. టీబీకి వ్యతిరేకంగా మనిషిలో రోగనిరోధక శక్తిని పెంచడానికి ఈ సదస్సులు ఎంతగానో ఉపయోగపడ తాయన్నారు. రెండువారాలకు పైబడి దగ్గు ఉన్నవారు తప్పనిసరిగా ప్రభుత్వాస్పత్రిలో వైద్య పరిక్షలు చేయించుకోవాలన్నారు. గళ్ల పరీక్షలు చేసి వ్యాధి నిర్ధారణ అయితే ఆరునెలల పాటు మందులు డాట్స్ ద్వారా అందిస్తామన్నారు. టీబీ రోగులకు పోషకాహారం కోసం ప్రతినెలా రూ.1000 అందిస్తామన్నారు. క్షయవ్యాధిలేని సమాజం కోసం అందరం కృషి చేయాలన్నారు. ఇంటింటి క్యాన్సర్ పరిక్షలు నిర్వహించేకార్యక్రమం త్వరల్లో జరుగుతుందన్నారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో వైద్యాధికారి రవీంద్రనాయక్, హెల్త్‌సూపర్‌వైజర్ నాగరాజు, ఆంగన్‌వాడీకార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రమాద ఘంటికలు!



నా పేరు బండి రమేష్. సుండుపల్లె మండలం రాచవాండ్లపల్లె. నాకు వ్యవసాయ రీత్యా 8 ఎకరాలు మామిడి తోట ఉంది. మామిడి చెట్లకు నీటిని అందించేందుకు రెండు మోటార్లను ఏర్పాటు చేసుకున్నాను. ఒక్కో మోటర్ లో 2.5 ఇంచుల నీళ్లు వస్తున్నాయి. ఈ ఏడాది చెరువులు, కుంటలలో నీరు లేకపోవడంతో రెండు బోర్లలో నీరు చాలావరకు తగ్గుముఖం పట్టాయి. మామిడి తోటలో పూత దశ నుంచి పిందెలు దిగే సమయంలో ఈ విధంగా నీటిమట్టం తగ్గ ముఖం పట్టడంతో చాలావరకు పిందెలు నేల రాలుతున్నాయి. గతంలో ఎప్పుడూ ఇలాంటి ఇబ్బంది ని ఎదుర్కోలేదు. సరైన దిగుబడి లేక తీవ్ర నష్టాన్ని ఎదుర్కోవాల్సి వస్తోంది.

- భూగర్భంలో జలం...ఆందోళనలో జనం
- రోజురోజుకు తగ్గిపోతున్న నీటి మట్టం
- ఎండ ప్రభావంతో ఇంకిపోతున్న ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు



సుండుపల్లె మండల పరిధిలోని మల్లక్కగారిపల్లె సమీపంలో నీరు లేక వెలవెలబోతున్న వ్యవసాయ మోటారు బావులు


సాక్షి రాయచోటి: వేసవి ప్రారంభమైందో...లేదో భానుడి ప్రభావం తీవ్రంగా కనిపిస్తోంది. ఒకవైపు ఎండ సెగలు, మరోవైపు గాలుల ధాటికి నీరు ఆవిరవుతోంది. 2024లో కరువు ప్రభావంతో వర్షపాతం అంతంత మాత్రంగా నమోదు కావడం ....దానికితోడు చెరువులు,కుంటల్లో జలాలు కూడా లేకపోవడంతో ప్రస్తుతం పరిస్థితి ఇబ్బందికరంగా మారుతోంది. రోజురోజుకు నీటిమట్టాలు పాతాళంలోకి చేరుతుండడంతో అందరిలోనూ ఆందోళన నెలకొంది. ప్రధానంగా ఇటు తాగునీటితోపాటు సాగునీటికి కూడా సంకటం మొదలైంది.

ఇంకిపోతున్న జలం

జిల్లాలో భూగర్భ జలమట్టం రోజురోజుకు ఇంకిపోతోంది. ఉదాహరణకు జనవరిలో బోరులో రెండు ఇంచుల నీరొస్తుండగా, ప్రస్తుతం ఒక ఇంచుకు పడిపోయిన పరిస్థితి కళ్లెదుటే కనిపిస్తోంది. రోజురోజుకు ఎండ ప్రభావం పెరిగే కొద్ది మరింత విపత్కర పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఎక్కడ చూసినా బావులతోపాటు బోర్లలోనూ నీటిమట్టం తగ్గిన పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

పంటలపై ప్రభావం

ఎండలు పెరిగే కొద్ది పంట లపై తీవ్ర ప్రభావం కనిపిస్తోంది. బోర్లలో నీటిమట్టం తగ్గుతుండడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. జిల్లాలో ప్రధానంగా సాగులో ఉన్న మామిడి తోటలకు సంబంధించి రైతన్నలు ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా దోస, టమోటా, ఇతర పండ్ల తోటలతోపాటు కూరగాయల పంటలకు సంబంధించి కూడా బోర్లలో నీరు రోజురోజుకు ఇంకుతున్న నేపథ్యంలో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు.



ఎండిపోతున్న నీటి వనరులు

జిల్లాలో చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల్లోనూ నీటిమట్టం రోజురోజుకూ పడిపోతోంది. వెలిగల్లు, పెద్దేరు, శ్రీనివాసపురం, ఝరికోన, బాహుదా ఇలా అన్ని నీటి వనరుల్లోనూ నీటిమట్టం పడిపోతోంది. మరోవైపు జిల్లాలోని చెరువులు, కుంటలు, నదులు, బోరు బావులు, బావుల్లోనూ నీటిమట్టం తగ్గిపోయింది. దీంతో తాగునీటి సమస్య తలెత్తుతుందని అధికారులు ఆందోళన చెందుతుండగా, రైతులు కూడా నీరు తగ్గిపోతుండడంతో ఒకింత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

10-20 మీటర్లకు పడిపోయిన నీటిమట్టం

జిల్లాలోని 19 మండలాల్లో 10–20 మీటర్ల లోతుకు నీటిమట్టం పడిపోయింది. గతేడాదితో పోల్చి చూసినా కూడా నీటిమట్టం పరిస్థితి దారుణంగా మారింది. ప్రధానంగా జిల్లాలోని ఓబులవారిపల్లె, సంబేపల్లె, పేటీఎం, కలికిరి, చిన్నమండెం, గుర్రంకొండ, బి.కొత్తకోట, ములకలచెరువు, రాజంపేట, కురబలకోట, గాలివీడు, పెనగలూరు, పుల్లంపేట, తంబళ్లపల్లె, చిట్వేలి, కేవీ పల్లె, నిమ్మనపల్లె, నందలూరు, సుండుపల్లె మండలాల్లో 10–20 మీటర్ల లోతుకు భూగర్భ జలమట్టం పడిపోయింది. 20–30 మీటర్లకు వాల్మీకిపురం మండలంలో నీటిమట్టం పడిపోయింది. 5–10 మీటర్లలోపు కలకడ, రైల్వే కోడూరు,పెద్దమండ్యం, వీరబల్లి, మదనపల్లె, లక్కిరెడ్డిపల్లె, రామాపురం మండలాలు ఈ కోవలో ఉన్నాయి. ప్రస్తుతం పరిస్థితి చూస్తే జిల్లాలోని అన్ని ప్రాంతాల్లోనూ ప్రమాద ఘంటికలు కనిపిస్తున్నాయి.

ఏప్రిల్ 1న ఒంటిమిట్టలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



ఏకశిలపై వెలసిన సీతారామ లక్ష్మణులు

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి వారి ఆలయంలో ఏప్రిల్ 6వ తేదీ నుంచి 14 శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఇందులో భాగంగా ఏప్రిల్ 1న ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, ఏప్రిల్ 5న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ నిర్వహించనున్నారు.ప్రతిరోజూ ఉదయం 7.30 నుంచి 9.30 గంటల వరకు, రాత్రి 7 నుంచి 9 గంటల వరకు వాహన సేవలు జరగనున్నాయి.

బ్రహ్మోత్సవాల్లో వాహనసేవల వివరాలు

ఏప్రిల్ 6న ఉదయం 9.30 నుండి 10.15 గంటల వరకు బృషభలగ్నం నందు ధ్వజారోహణం, రాత్రి శేష వాహనం, 7న ఉదయం వేణుగానాలంకారం, రాత్రి హంస వాహనం, 8న ఉదయం వటపత్రశాయి అలంకారం, రాత్రి సింహవాహనం, 9న ఉదయం నవనీత కృష్ణాలంకారం, రాత్రి హనుమంత వాహనం, 10న ఉదయం మోహినీ అలంకారం, రాత్రి గరుడసేవ, 11న ఉదయం శివధనుర్బాణ అలంకారం , రాత్రి కల్యాణోత్సవం, గజవాహనం, 12న ఉదయం రథోత్సవం, 13న ఉదయం కాళీయమర్ధనాలంకారం, రాత్రి అశ్వవాహనం, 14న ఉదయం చక్రస్నానం , రాత్రి ధ్వజావరోహణం, 15వ తేది సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 వరకు పుష్పయాగం నిర్వహించనున్నారు.

చట్టాలపై పాఠశాల స్థాయి నుంచి అవగాహన



మాట్లాడుతున్న జిల్లా మూడో అదనపు జడ్జి ప్రవీణ్‌కుమార్. చిత్రంలో ఏఎస్పీ మనోజ్ రామనాథ్ హెగ్డే

రాజంపేట: కొన్ని దేశాల్లో ఆదివారం పోలీసులకు సెలవు ఇస్తున్నారన్నారు. ఎందుకంటే అక్కడ ప్రజలు చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉన్నారన్నారని, కాబట్టి అలా జరుగుతోందని 3వ జిల్లా అదనపు జడ్జి ప్రవీణ్‌కుమార్ అన్నారు.శనివారం అన్నమాచార్య యూనివర్సిటీలో పోక్సో, ఐపీసీబీఎన్ఎస్ యాక్ట్‌లపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు, న్యాయవ్యవస్థ ఉన్నందువల్లనే ప్రజలందరూ సమాజంలో ప్రశాంతంగా జీవిస్తున్నారన్నారు. విద్యార్థులకు పాఠశాల స్థాయి నుంచే చట్టాలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు సెల్‌ఫోన్‌కు చాలామంది బానిసలై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. సెల్‌ఫోన్ వల్ల ఎంత ఉపయోగం ఉందో, అంతా ప్రమాదకరమనేది గుర్తుంచుకోవాలన్నారు. బాల్యవివాహాలను ప్రోత్సహించ రాదని ఇందుకు కఠినమైన చర్యలు ఉంటాయన్నారు. బాల్యవివాహాలు ఒకసారి స్టేట్‌మెంట్‌రికార్డు అయితే 20 సంవత్సరాలు జైలు శిక్షపడుతుందన్నారు. చిన్న, చిన్న విషయాలకు ఆత్మహత్యలకు పాల్పడటం అవివేకమన్నారు. చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు.. రాజంపేట ఏఎస్పీ మనోజ రామ్‌నాథ్‌హెగ్డే మాట్లాడుతూ యువల ప్రేమకు, మత్తుపదార్థాలకు, సెల్‌ఫోన్లకు బానిసలై భవిష్యత్తును కాలరాసుకుంటున్నారన్నారు. ప్రేమపేరుతో ఈవ్‌టీజింగ్, ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్ట్రాగాంలో మేసెజ్లు, మార్ఫింగ్ ఫోటోలు అప్లోడ్ చేస్తూ నేరాలకు పాల్పడుతున్నారు. వీటి అన్నింటికి పోక్సో యాక్ట్ వర్తిస్తుందన్నారు. సదస్సులో అన్నమాచార్య యూనివర్సిటీ వీసీ సాయిబాబారెడ్డి, మన్నూరు సీఐ కుళాయప్ప, కళాశాల ప్రిన్సిపాల్ డా.నారాయణ, ప్రొఫెసర్ డా.సుబ్బారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం జడ్జి ప్రవీణ్, ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్‌హెగ్డేను ఏయూ యాజమాన్యం ఘనంగా సన్మానించింది.

జిల్లా మూడో అదనపు జడ్జి ప్రవీణ్‌కుమార్

హార్సిలీహిల్స్‌కు వెలుగులు ఎప్పుడు?

అంతా అగమ్యగోచరం

బి.కొత్తకోట: ఎక్కడ చూసిన విద్యుత్ వెలుగులు కనిపిస్తుంటే పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై ఐదు హైమాస్ లైట్లున్నా వెలగని పరిస్థితి నెలకొంది. ఇక్కడి స్థానికులు, పర్యాటకులు ఎంతోకాలంగా ఎల్ ఈడీ లైట్లు వేయాలని విన్నవిస్తున్నా ఎప్పుడు వేస్తారో తెలియని పరిస్థితి. ప్రతి పల్లెలో విద్యుత్ స్తంభాలకు ఎల్ఈడీ లైట్లు ఏర్పాటవుతున్నాయి, హార్సిలీహిల్స్‌పై ఎల్ఈటీ లైట్ల కథ ఎలా రాత్రయితే చీకటి కమ్ముకుంటోంది. సముద్ర మట్టానికి 4,141 అడుగుల ఎత్తులోని ఈ పర్యాటక కేంద్రానికి వెలుగుల మోక్షం ఎప్పుడు అన్నది ఎదురుచూపే అవుతోంది.

చీకటిలోనే మగ్గిపోతోంది

చుట్టూ అటవీప్రాంతం కలిగిన కొండపై విష సర్పాలు, దుప్పులు, జింకలు సంచరిస్తుంటాయి. వీటి బారిన పడితే స్థానికులకు ప్రాణాపాయం తప్పదు. ముఖ్యంగా వీధిదీపాల ఏర్పాటు జరగడం లేదు. రోడ్ల వెంబడి ఉన్న విద్యుత్ స్థంభాలకు వీధి దీపాలను ఏర్పాటు చేస్తే వెలుగు ఉంటుంది. సందర్శకులు, స్థానికులకు ఇబ్బందులు ఉండవు. 20 ఏళ్ల క్రితం కొండపైనున్న అక్కడక్కడా వీధిదీపాలు ఏర్పాటు చేసి వదిలేశారు. అప్పుడు వేసిన లైట్లు ఇప్పుడు లేవు. స్తంభాలకు పైపులు అలాగే కనిపిస్తున్నాయి. వాటికి లైట్లను అమర్చితే ప్రయోజనం. పర్యాటక ప్రాంతమైన హార్సిలీకొండకు ప్రభుత్వ స్థాయి అధికారులు, ముఖ్యనేతలు రాకపోకలు సాగించే ఈ ప్రాంతంపై ప్రత్యేక దృష్టిసారించాల్సిన అవసరం ఉంది. ఇక్కడికి అధికంగా పొరుగు రాష్ట్రాలకు చెందిన పర్యాటకులు వస్తుంటారు. ఎల్ ఈడీ లైట్లు ఏర్పాటు చేస్తే వీరికి సౌకర్యం కల్పించడమేకాక స్థానికులకు ఇబ్బందులు తొలగుతాయి.



గాలిబండపై వెలగని హైమాస్ లైటు



లైటు లేని విద్యుత్ స్తంభం

సమావేశాలు ఎప్పుడు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మూడునెలలకోసారి హార్సిలీహిల్స్ టౌన్‌షిప్ కమిటీ సమావేశాలు జరిగేవి. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఒక్క సమావేశం కూడా జరగలేదు. దీంతో హార్సిలీహిల్స్‌పై ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. ఇకనైనా టౌన్‌షిప్ కమిటీ సమావేశాలు నిర్వహిస్తే ఎన్నో సమస్యలు పరిష్కారం అయ్యేందుకు వీలుంది.

దిష్టిబొమ్మల్లా హైమాస్


వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.14.75 లక్షలతో ఐదు చోట్ల వాటిని ఏర్పాటు చేయించారు. 16 మీటర్ల ఎత్తులో గాలిబండపై రెండు చోట్ల, ఏనుగు మల్లమ్మ ఆలయం వద్ద ఒకటి, జిడ్డు సర్కిల్‌లో ఒకటి, రెవెన్యూ అతిథి గృహం వద్ద ఒకటి ఏర్పాటు చేశారు. ప్రారంభంలో అన్ని లైట్లు వెలుగుతూ ఎక్కడో ఉన్న వారికి ఈ లైట్ల వెలుగు కనిపించేది. అదిగో హార్సిలీహిల్స్‌పై లైట్లు అని చెప్పుకునేవారు. ప్రస్తుతం స్విమ్మింగ్ పూల్, రెవెన్యూ అతిథి భవనం వద్ద మాత్రమే హైమాస్ లైట్లు వెలుగుతున్నాయి. మిగిలిన మూడు వృథాగా ఉన్నాయి.

ఎత్తెకాఫ్..ఏకాంత ఆరాధన



ఎత్తెకాఫ్ కోసం మసీదులలో ఏర్పాటు చేసిన డేరాలు

30వ తేదీ వరకు మసీదుల్లోనే గడపనున్న ముస్లింలు



రాజంపేట టౌన్: రంజాన్ మాసంలో వచ్చే బడీరాత్‌కు ఎంత ప్రాధాన్యత ఉంటుందో ఎత్తెకాఫ్‌కు కూడా అంతే ఉంటుంది. రంజాన్ మాసంలో చివరి పదిరోజులు అనేక మంది ముస్లింలు ఎత్తెకాఫ్‌ను ఆచరిస్తారు. శుక్రవారం సాయంత్రం నుంచి జిల్లాలోని అనేక మసీదుల్లో ముస్లింలు ఎత్తెకాఫ్‌ను పాటిస్తున్నారు. అల్లాహ్ ఇంటి (మసీదు) ఆతిథ్యం ఎత్తెకాఫ్ కల్పిస్తుందని ముస్లిం మత పెద్దలు చెబుతున్నారు. రంజాన్ మాసంలో ఒక ఊరిలో ఎత్తెకాఫ్ ఉండకపోతే ఆ ఊరిపై నా కరుణ, ప్రేమాభిమానాలు ఉండవు అని పవిత్ర ఖురాన్‌లో అల్లాహ్ స్పష్టం చేశారు. ఇల్లు, కుటుంబం, వృత్తిని పక్కనపెట్టి వీలైనన్ని రోజులు లేక కనీసం 24 గంటలు అయినా మసీదులో గడపడమే ఎత్తెకాఫ్. అన్నింటిని త్యాగం చేసి ఆధ్యాత్మికతతో ఉండే వారిపై అల్లాహ్ అత్యంత కరుణ చూపి మొరను ఆలకిస్తారని మౌల్వీలు చెబుతున్నారు. అయితే పెద్ద తరహాలో ఉండే అనేక మంది పదిరోజుల పాటు ఎత్తెకాఫ్‌ను పాటించనున్నారు.

ఎత్తెకాఫ్ ఇలా...

ఎత్తెకాఫ్ ఉండాలంటే శుద్ధి స్నానం చేసి మసీదుకు వెళ్లి వజూ (ముఖం, చేతులు, కాళ్లను శుద్ధి చేసుకోవడం) చేయాలి. ఎత్తెకాఫ్ నియ్యత్‌ను చదవాలి. ఇతరుల నుంచి భంగం లేకుండా మసీదులో డేరా ఏర్పాటు చేసుకొని అక్కడే ఉండాలి. తహతుల్ వజూ, తహతుల్ మజ్జీద్‌ల రెండేసి రకాత్‌ల నఫిల్ నమాజు చదవడం మంచిది. ఖురాన్ పఠనం , దువా, జికర్ ఇతర నమాజ్‌లు చేసుకోవాలి. మల, మూత్ర విసర్జన, వజూ, గుసూల్ స్నానం కోసం మాత్రమే డేరాల నుంచి బయటకు రావాలి. మసీదు గడపదాటరాదు. సహర్, ఇఫ్తార్ ఇస్తే స్వీకరించాలి. లేదా ఇంటి నుంచి భోజనం, ఆహార పదార్థాలు తెప్పించుకోవాలి. కలిమా ఏ తయ్యిబా లాయిలాహ ఇల్లల్లాహ్ ముహమ్మదూర్ రసూలల్లా (సొల్లెల్లాహు అలైహి వసల్లం), అస్తగ్ ఫిరల్లాహ్ బాగా పఠించాలి. సహరి కంటే ముందు 12 రకాతుల తహజూద్ (కనీసం రెండు రకాతులు) నమాజ్, సజ్‌దాలో దువా చేస్తే అల్లాహ్ సమీపం నుంచి మొర వింటారని ఖురాన్ బోధిస్తుంది. భార్య, పిల్లలు, తల్లిదండ్రులు, తోబుట్టువులు, కుటుంబ సభ్యులు, బంధు, మిత్రుల కష్ట సుఖాలతో పాటు సర్వ మానవాళి సంక్షేమాన్ని కోరుతూ ప్రార్థనలు చేయడం ఉత్తమం. ఇఫ్తార్ సమయం నుంచి మరుసటి రోజు ఇఫ్తార్ వరకు ఒకరోజు అవుతుంది.మసీదులో అడుగు పెట్టగానే 'బిస్మిల్లాహి దాఖల్తువ అలైహి తవక్కల్‌తు వనవైతు సున్నతుల్ ఎత్తెకాఫ్ నియ్యత్ చదవాలి. ఎత్తెకాఫ్‌లో ఉన్నప్పుడు మనసును అల్లాహ్‌పైనే ఉంచాలి. ఏ ఇతర విషయాలను పట్టించుకోకూడదు.

ఎత్తెకాఫ్‌కు ఎంతో ప్రాధాన్యత



రంజాన్‌మాసంలో ఎత్తెకాఫ్‌కు ఎంతో ప్రాధాన్యతవుంది. అల్లాహ్ సన్నిధిలో నమాజ్, జికర్, దువాచేస్తే ఆలకిస్తారు. ఒకరోజు ఎత్తెకాఫ్ పాటించినా నరకాగ్ని నుంచి అల్లాహ్ కాపాడుతారు. -మౌలానా అతాఉల్లాహ్, ఇమామ్, నూరాని మస్జీద్, ఈడిగపాళెం, రాజంపేట

మోక్షమార్గానికి అనువైన రోజులు



రంజాన్ మాసంలో చివరి పది రోజులు మోక్షమార్గానికి అనువైన రోజులు. ఎత్తెకాఫ్‌లో ఉన్న వారు కఠోర దీక్ష చేపట్టి ఖురాన్‌ను పఠించాలి. మసీదు గడప దాటకుండా అనుక్షణం అల్లాహ్ స్మరణలోనే ఉంటే తప్పక పుణ్యం, మోక్షం లభించడంతో పాటు ఏ పరిస్థితిలో ఉన్నా సాటి మానవుడి పట్ల ప్రేమాభిమానాలు చూపే గొప్ప మనస్తత్వం కలుగుతుంది. అందువల్లే ఎత్తెకాఫ్‌ను పాటిస్తున్నాను. -మహమ్మద్ సమీర్, ఉస్మానగర్, రాజంపేట

క్లుప్తంగా

కొబ్బరిచెట్టుపై పిడుగు



పిడుగు పాటుకు కొబ్బరిచెట్టుపై మంటలు

రామసముద్రం : మండలంలోని చెంబకూరు నుంచి కొత్తూరుకు వెళ్లే రోడ్డు మార్గంలో శనివారం సాయంత్రం కొబ్బరిచెట్టుపై పిడుగుపడింది. దీంతో చెట్టుపై మంటలు రాజుకున్నాయి. గతనెల రోజులుగా ఉక్కపోతకు గురైన ప్రజలకు వాతావరణంలో మార్పులు వచ్చి ఉరుములు, మెరుపులతో కూడిన చిరు జల్లుల వర్షం కురిసింది. ఈ నేపథ్యంలో చెంబకూరుకు చెందిన రైతు గాండ్ల శంకరప్ప పొలంలోని కొబ్బరిచెట్టుపై పిడుగు పడటంతో మంటలు ఏర్పడ్డాయి. దీన్ని చూసేందుకు స్థానికులు ఆసక్తి చూపారు.

జింకపై కుక్కల దాడి

– కాపాడిన యువకులు



కుక్కల దాడిలో గాయపడిన జింక

నందలూరు : మండలంలోని బహుదానది సమీపంలోని నేషనల్ హైవే బైపాస్ రోడ్డు పక్కన ఉన్న వరి పంట పొలాల్లో ఓ జింకను శనివారం కొన్ని కుక్కలు వెంటపడి దాడి చేస్తుండగా కొంత మంది యువకులు కాపాడారు. జింకను కాపాడి వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు, అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని జింకను అటవీశాఖ అధికారులకు అప్పగించారు. కుక్కల దాడి నుంచి రక్షించి సమాచారం తెలిపిన యువకులు గొల్లపల్లికి చెందిన బడే, తిమ్మయ్య, పవన్ కుమార్, కొండయ్య, నందకుమార్, షమీవుల్లాను స్థానికులు అభినందించారు.

ఆడుతూ...పాడుతూ చదివేద్దాం

- ఒంటిపూట బడి .. ఓ కంట కనిపెట్టాలి
- తల్లిదండ్రులకు అప్రమత్తత అవసరం

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు	:2,200
విద్యార్థులు	:1,54.789
ప్రైవేటు పాఠశాలలు	:543
విద్యార్థులు	:1,12,589



ఫజిల్స్ అడుతున్న చిన్నారులు

మదనపల్లె సిటీ : పిల్లలు ఎంతగానో ఎదురు చూసే ఒంటిపూట బడులు రానే వచ్చాయి. మధ్యాహ్నం 12.30 గంటల వరకే పాఠశాలలు ఉంటాయి. తరువాత ఇంటికి రాగానే బడి బ్యాగులను పెట్టడమే స్నేహితులతో ఎంచక్కా చెట్లు, పుట్టలు, గుట్ల వెంట తిరుగుతూ ఆటలాడటం, బావులు,చెరువుల వద్దకు వెళ్లడం, ఈత వచ్చినా రాకున్నా వాటిల్లోకి దిగి లేనిపోని ప్రమాదాలు కొని తెచ్చుకుంటారు. ఈ నేపథ్యంలో పిల్లల విషయంలో తల్లిదండ్రులకు అప్రమత్తత అవసరం. పిల్లలను మధ్యాహ్నం బయటకు వెళ్లకుండా చూడటం మేలు. అలా అని వారు టీవీలు, సెల్‌ఫోన్లకు అంటిపెట్టుకుని ఉండటమూ తగదు. ఈ దశలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ప్రణాళిక ప్రకారం వ్యవహరించాలని నిపుణులు సూచిస్తున్నారు.

మధ్యాహ్న సమయంలో..

దినపత్రికలను చదివేందుకు విద్యార్థులు ఆసక్తి కనబరచాలి. ఆదివారం అనుబంధం లాంటి మ్యాగజైన్లలో ఫజిల్స్‌ను సాధన చేయాలి. తద్వారా మెదడు పనితీరు చురుకవుతుంది. బొమ్మలకు రంగులు వేసే పుస్తకాలు, సృజనాత్మకతను పెంపొందిస్తాయి. పిల్లలు బయటకు వెళ్లకుండా ఇంటి వద్దే ఉంటూ స్నేహితులతో కబుర్లు చెప్పుకుంటూ క్యారమ్స్, చెస్ వంటి ఆటలు ఆడాలి. ఆటల పరికరాలు అనేకం షాపుల్లో దొరుకుతాయి. ఇంట్లోనే పిల్లలు వాటితో భవనాలు, వంతెనలు, యంత్రాలను నిర్మించడం ఆసక్తికరంగా ఉంటుంది. అవి వారికి ఎంతో కాలక్షేపాన్ని కలిగిస్తాయి.

తల్లిదండ్రులు తమ బాల్యంలో ఆడుకున్న పరమపద సోపానపటం, వామనగుంతలు,పులి మేక దాడి, అష్టా చెమ్మా వంటి ఆటలు ఉంటాయి. పిల్లలకు వాటిని పరిచయం చేసి వారితో పాటు కలిసి ఆడుకుంటే బాగుంటుంది.

ఆహారంపై శ్రద్ధ

ఎండ తీవ్రత కారణంగా చిన్నారులు త్వరగా నీరసించిపోతుంటారు. పాఠశాలకు వెళ్లే సమయంలో తేలికపాటి ఆహారం, త్వరగా జీర్ణమయ్యే అల్పాహారంతో పాటు పండ్లరసం అందజేయాలి. భోజనంలో కూరగాయలు, ఆకు కూరలు ఉండే విధంగా చూడటంతో పాటు అధిక నీటి శాతం ఉన్న కూరలకు ప్రాధాన్యం ఇవ్వాలి. వేపుళ్లకు దూరంగా ఉంచే ప్రయత్నం చేయాలి.

అప్రమత్తతే కీలకం:

చెరువులు, బావుల్లో ఈత కొట్టేందుకు వెళ్తుంటారు. లోతు తెలియకుండా దిగడం వల్ల ప్రమాదాలు జరిగే అస్కారం ఉంటుంది. జిల్లాలో గతంలో అనేక చోట్ల ఈతకు వెళ్లి పలువురు చిన్నారులు నీటమునిగి మృత్యువాత పడిన సంఘటనలున్నాయి. ఎండల్లో ఎక్కువ తిరగడం వల్ల వడదెబ్బ బారిన పడే అవకాశం ఉంటుంది. మధ్యాహ్నం గొడుగులు వాడటం, టోపీలు ధరించడం, ముఖానికి చేతిరుమాలు కట్టుకునేలా జాగ్రత్తలు సూచించాలి.

సాయంత్రం పూట:

5 గంటల తరువాత ఎండ తగ్గుముఖం పడుతుంది. అప్పుడు పిల్లలు బయట ఆటలు ఆడుకునేలా చూడాలి. శారీరక వ్యాయామంలా ఉంటుంది. రాత్రి 7 గంటల తరువాత చదువుకోవటంపై విద్యార్థులు దృష్టి సారించాలి. హోంవర్క్ చేసుకోవాలి.

ఒంటపూట బడులు కావటం వల్ల పిల్లలు వేకువజామునే నిద్రలేవాల్సి ఉంటుంది. అందువల్ల రాత్రిపూట తొందరగా నిద్రపోవడం మేలు.

పిల్లలను జాగ్రత్తగా కనిపెట్టాలి



ఒంటిపూట బడుల సమయంలో తల్లిదండ్రులు తమ పిల్లలను జాగ్రత్తగా కనిపెట్టాలి. వారి అలవాట్లు, ఆహారం, ఆరోగ్యం, చదువు వంటి విషయాల్లో ప్రణాళిక కలిగి ఉండాలి. దినపత్రికలు, పుస్తక పఠనాన్ని అలవర్చితే దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరుతుంది.

– పి.ప్రసాద్‌రెడ్డి, పీడీ, ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీ, మదనపల్లె

అనారోగ్యానికి గురైతే నిర్లక్ష్యం వద్దు



ఎండలో ఆటలు ఆడటం వలన చిన్నారులు వెంటనే డీహైడ్రేషన్‌కు గురవుతారు. చర్మంపై ముడతలు ఏర్పడటం, గొంతు ఎండిపోవడం వంటి లక్షణాలుంటే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. పండ్లు, పండ్లరసాలు, కూరగాయలు, నీటి శాతం అధికంగా ఉన్నవాటిని తీసుకోవాలి.

– డాక్టర్ ఆశాలత, పీహెచ్‌సీ, కోసువారిపల్లె

తప్పతాగి మంటల్లో పడి వ్యక్తి మృతి



చిన్నసుబ్బయ్య(ఫైల్)

రామాపురం : మండలంలోని నల్లగుట్టపల్లె పంచాయతీ బీసీ కాలనీకి చెందిన గంప చిన్న సుబ్బయ్య (55) తప్పతాగి మంటల్లో పడి మృతి చెందినట్లు ఎస్‌ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని నల్లగుట్టపల్లె పంచాయితీ బీసీ కాలనీకి చెందిన గంప చిన్నసుబ్బయ్య శుక్రవారం సాయంత్రం పొలం వద్ద గట్టుకు నిప్పంటించడానికి వెళ్లి నిప్పులో పడి మృతి చెందాడు. రాత్రి వరకు భర్త ఇంటికి రాకపోవడంతో భార్య సుబ్బయ్య ఇంటి పక్కన వాళ్లను ఆరా తీసింది. మరుసటి రోజు ఉదయం శనివారం ఆ గ్రామ పరిధిలోనే గొర్ల కాపరులు మేతకు వెళ్లి చూసి గ్రామస్తులకు సమాచాం ఇచ్చారు. వెంటనే పొలం గట్టు వద్దకు వెళ్లి చూడగా తన భర్త నిప్పులో పడి మృతి చెందాడని, విషయాన్ని మండల పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోగొట్టుకున్న పర్సు అప్పగింత



మహిళకు పోగొట్టుకున్న పర్సును అందజేస్తున్న సీఐ బివి చలపతి

రాయచోటి టౌన్ : పట్టణానికి చెందిన మహిళ శనివారం ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో తన పర్సు పోగొట్టుకొంది. వెంటనే పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయడంతో సీఐ బివి చలపతి సీసీ కెమెరాలను ఆధారంగా చేసుకొని తన సిబ్బంది హెచ్‌సీ సురేంద్ర ద్వారా పరిశీలించారు. దొంగను పట్టుకొని పోగొట్టుకున్న పర్సును స్వాధీనం చేసుకొన్నారు. వెంటనే బాధ్యురాలిని పిలిచి పోగొట్టుకున్న బ్యాగ్ (పర్స్) అప్పగించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ షాపింగ్ కోసమైనా, ఇతరా అవసరాల కోసం వచ్చిన సందర్భంలో మీతో తెచ్చుకున్న విలువైన వస్తువులు, బ్యాగ్‌లు, పర్సులను చాలా జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. కొత్త వ్యక్తుల పట్ల జాగ్రత్త, అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

చేనేత నగర్ హార్డ్‌వేర్ షాపులో చోరీ

కురబలకోట : మండలంలో చేనేతనగర్‌లోని నవాజ్ హార్డ్‌వేర్ షాపులో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. పైన రేకు కత్తిరించి షాపులోకి ప్రవేశించారు. రాత్రి 12 గంటలకు లోనికి వెళ్లారు. 40 నిమిషాల పాటు చోరీకి పాల్పడ్డట్లు చోరీ చేసినట్లు సీసీ పుటేజీలో కనిపిస్తోంది. ఒక్కరే కన్పిస్తున్నారు. అంగడి అంతా కలియ తిరిగారు. సీసీ పుటేజీలో ఈ దృశ్యాలు స్పష్టంగా కన్పిస్తున్నాయి. రూ. 25 వేల నగదు, మానిటర్‌ను ఎత్తుకెళ్లాడు. పైగా ఆపిల్ కాయ తింటూ చోరీకి పాల్పడడం విశేషం. శనివారం బాధితుడు నవాజ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణ జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

టీ హోటల్‌లో పేలిన గ్యాస్ సిలిండర్





అంగళ్లులో నేల మట్టమైన టీ హోటల్, కాలిన గాయాలతో టీహోటల్ ఓనర్ కృష్ణయ్య

- హోటల్ నిర్వాహకుడికి తీవ్ర గాయాలు
- రూ. 50 లక్షల ఆస్తి నష్టం
- ఉలిక్కి పడిన అంగళ్లు

కురబలకోట : మండలంలోని అంగళ్లు బస్టాప్ పక్కన ఉన్న టీ హోటల్‌లో శనివారం ఉదయం ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ పేలింది. పెద్ద ఎత్తున శబ్దం రావడంతో పరిసర ప్రాంతాల వారు ఒక్కసారిగా ఉలిక్కి పడ్డారు. అదీ అంగళ్లు బస్టాప్ దగ్గరే ఇలా జరగడంతో కలకలాన్ని సృష్టించింది. రూ. 50 లక్షల దాకా నష్టం వాటిల్లి ఉంటుందని భావిస్తున్నారు. ఉదయం ఆరు గంటల ప్రాంతంలో కాబట్టి జన సంచారం పెద్దగా లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. లేదంటే నిత్యం జనాలతో రద్దీగా ఉండే బస్టాప్ ప్రాంతంలో పెద్ద ప్రమాదం సంభవించి ఉండేది. సిలిండర్ పేలడంతో టీ హోటల్ భవనం కుప్పకూలింది. ఇరుగుపొరుగున వున్న భవనాలు కూడా కదిలాయి. గ్యాస్ లీక్ కావడమే ఈ ఘటనకు కారణంగా భావిస్తున్నారు. జిల్లాలో సంచలనం కల్గించిన ఈ దుర్ఘటనకు సంబంధించి బాధితుడితో పాటు పరిసర ప్రాంతాల వారి కథనం మేరకు..కదిరి ప్రాంతం తనకల్లుకు చెందిన కృష్ణయ్య (52) రెండేళ్లుగా అంగళ్లు బస్టాప్ వద్ద అద్దె రూములో ఓ ఫ్రాంచైజీస్ టీ హోటల్ నిర్వహిస్తున్నాడు. యథావిధిగా శనివారం ఉదయం టీ హోటల్ తెరచి స్టవ్ వద్దకు వెళ్లి లైటర్‌తో గ్యాస్ వెలిగించాడు. ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. కృష్ణయ్య దుస్తులు అంటుకుని ఒంటికి మంటలు వ్యాపించాయి. భవనమంతా పెద్ద ఎత్తున పొగలు కమ్మాయి. ఆయన కాలుతున్న మంటలతో రోడ్డుపైకి రావడంతో స్థానికులు వెంటనే ఆయన ఒంటిపై మంటలను ఆర్పివేశారు. ఆయన బయటకు వచ్చిన వెంటనే పెను శబ్దం రావడంతో ఒక్కసారిగా టీ హోటల్ భవనం కుప్పకూలింది. కృష్ణయ్య ముందుగా బయటకు రావడంతో తీవ్ర గాయాలతో బయటపడ్డారు. లేదంటే బండల కింద ఊహించని ప్రమాదం సంభవించి ఉండేది. సంఘటన విషయం తెలుసుకున్న ఫైరింజన్ హుటాహుటిన అంగళ్లుకు చేరుకుంది. అప్పటికే సంఘటన జరిగిపోయింది. బాధితుడు కృష్ణయ్యను హుటాహుటిన మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు.

పెద్ద శబ్దంతో ఉలిక్కిపడ్డాం



సంఘటన జరిగిన టీ హోటల్ పక్కనే మా ఎరువుల అంగడి ఉంది. శనివారం ఉదయం ఆరు గంటల ప్రాంతంలో ఒక్కసారిగా పెద్ద శబ్దం వచ్చింది. ఉలిక్కి పడ్డాం. మాషాపు ఉన్న భవనం కూడా అదిరింది. కిందకు వచ్చి చూస్తే టీ హోటల్ భవనం కుప్పకూలిపోయింది. పైగా బస్టాప్ ప్రాంతంలో ఇది జరగడం ఉదయం వేళ కావడంతో జన సంచారం పెద్దగా లేకపోవడంతో పెను ప్రమాదమేతప్పింది. పరిసర ప్రాంతాల వారు ఒక్కసారిగా భయంతో వణికిపోయారు.

– కనసాని వేణుగోపాల్‌రెడ్డి, ఫర్టిలైజర్ షాపు యజమాని, అంగళ్లు

మదనపల్లెలో ఆపరేషన్ గరుడ

- యథేచ్ఛగా నార్కోటిక్స్, మత్తు, స్టెరాయిడ్స్ విక్రయాలు
- డాక్టర్ చీటీ లేకుండా మందులు అమ్మితే కఠినచర్యలు



మందుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

మదనపల్లె : రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ షాపుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాలైన విజిలెన్స్, ఈగల్, డ్రగ్ కంట్రోల్‌తో పాటు పోలీసులు బృందాలుగా ఏర్పడి నిర్వహించిన ఆపరేషన్ గరుడ శుక్రవారం రాత్రి మదనపల్లెలో జరిగింది. పట్టణంలోని మూడు రిటైల్ మందుల షాపులు, ఒక హోల్‌సేల్ షాపులో నిర్వహించిన డెకాయ్ ఆపరేషన్‌లో...డాక్టర్ ప్రిస్క్రిప్షన్ చీటీ లేకుండా మందులు విక్రయిస్తున్నట్లు, మందులకు బిల్లు లేకుండా అమ్మకాలు చేస్తున్నట్లు గుర్తించామని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కేశవరెడ్డి తెలిపారు. మెడికల్ షాపుల్లో నార్కోటిక్స్, మత్తు కలిగించే మందులు, యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్స్ వైద్యుల సిఫారసు లేకుండానే విక్రయిస్తున్నట్లు తనిఖీల్లో తేలిందన్నారు. రెండు షాపుల్లో ఫార్మసిస్ట్ లేకుండానే, బిల్లులు వేయకుండానే మందులు విక్రయిస్తున్నారన్నారు. అలాగే మందుల కొనుగోలు, విక్రయాల మధ్య తేడాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. డెకాయ్ ఆపరేషన్‌లో తాము గమనించిన లోపాలపై నివేదిక తయారుచేసి ఉన్నతాధికారులకు పంపి వారి ఆదేశాల మేరకు తగు చర్యలు తీసుకుంటామన్నారు. మందుల షాపుల్లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు జరిపితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మత్తు, నార్కోటిక్, స్టెరాయిడ్స్ తదితర ఔషధాలు వైద్యుల సిఫారసు, చీటీ లేకుండా, బిల్లులు వేయకుండా అమ్మకూడదని తెలిపారు. అమ్మకాలు జరిపిన వెంటనే వాటి వివరాలను హెచ్-1 రిజిస్టర్‌లో నమోదుచేయాలని, లేనిపక్షంలో అలాంటివాటిపై కఠినచర్యలు తీసుకుంటామని తెలిపారు. దాడుల్లో జిల్లా విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు జే.మురళీకృష్ణ(ఎఫ్ఆర్ఓ), కే.వి.కిశోర్(ఏఈఈ), వి.నాగరాజు(సీఐ), కానిస్టేబుల్స్ టిప్పుసుల్తాన్, రాజీవ్‌కుమార్, రంగనాథ్‌లు పాల్గొన్నారు.

ఈతకెళ్లి యువకుడు మృతి

– అనుమానాస్పద మృతిగా కేసు నమోదు



అనిల్ (ఫైల్)

కలకడ : ఈతకెళ్లి ఓ యువకుడు మృతిచెందిన సంఘటన శనివారం మండలంలోని బాలయ్యగారిపల్లె పంచాయతీ ఝరిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రామాంజనేయులు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అన్నమయ్య జిల్లా సంబేపల్లె మండలం శెట్టిపల్లె పంచాయతీ కొత్త మాదిగపల్లె గ్రామానికి చెందిన సిరిపురి రామక్రిష్ణ ద్వితీయ కుమారుడు సిరిపురి అనిల్ (21) హైదరాబాద్‌లో నిర్మాణ కాంట్రాక్టర్ వద్ద కూలి పని చేసేవాడు. శుక్రవారం రాత్రి హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి చేరుకున్నాడు. శనివారం అతని మిత్రులు 9 మందితో కలిసి బొలెరో వాహనంలో ఝరికి చేరుకున్నారు. సాయంత్రం వరకూ ఝరిలో మిత్రులతో కలిసి సంతోషాన్ని పంచుకున్న అనిల్ ఈత కోసం ఝరిలోకి దిగి మృత్యువాత పడ్డాడు. అక్కడ ఏమి జరిగిందో తెలుసుకునే లోపు వారి వెంట తెచ్చుకున్న బొలెరో వాహనంలో అనిల్ మృతదేహాన్ని వారి స్వగ్రామం కొత్తమాదిగపల్లెకు తరలించారు. అనిల్ మృతిపై అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

మృతిచెందానికే వచ్చావా కొడుకా...

హైదరాబాద్‌లో ఉన్నా జీవించి ఉండేవాడని, ఇంటికి వచ్చి ఒక్కరోజు అయినా గడవకనే మృత్యువాత పడటంపై మృతుడి తల్లిదండ్రులు, బంధుమిత్రులు బోరున విలపించారు.

కేసు నమోదు : బాలయ్యగారిపల్లె పంచాయతీ ఝరిలో ఈతకు వెళ్ళి అనిల్ మృతిచెందడంపై అనుమానాస్పద కేసు నమోదు చేసినట్లు కలకడ ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం శనివారం రాత్రి పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి రామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కడప - బెంగళూరు రైల్వే పనులను పూర్తి చేయాలి

కడప ఎడ్యుకేషన్ : కడప బెంగుళూరు రైల్వే పనులను 20 సంవత్సరాల క్రితం మొదలు పెట్టినప్పటికీ అప్పటి నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్మాణ పనులను పూర్తి చేయడంలో పూర్తిగా వైఫల్యం చెందాయని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బి నారాయణ రెడ్డి, ఉపాధ్యక్షుడు సిఆర్వి ప్రసాద్ అన్నారు. శనివారం వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక కమిటీ ఆధ్వర్యంలో పబ్బపురం వద్ద కడప బెంగళూరు రైల్వే ట్రాక్‌ను పరిశీలించారు.

వివాహిత అనుమానాస్పద మృతి



మృతి చెందిన వివాహిత లత

మదనపల్లె : కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులతో మనస్థాపం చెంది వివాహిత ఉరివేసుకుని అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన శనివారం మదనపల్లె మండలంలో జరిగింది. వలసపల్లె పంచాయతీ కృష్ణాపురం గ్రామానికి చెందిన గణేష్ బాబు, లత(41) దంపతులు. వీరికి పరిమళ జమున ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పరిమళకు రెండేళ్ల క్రితం వివాహం కాగా, జమున డిగ్రీ చదువుతోంది. గణేష్ బాబు టెంపో డ్రైవర్ గా పనిచేస్తుండగా, లత కూలీ పనులకు వెళ్తూ స్థానికంగా ఉన్న డ్వాక్రా సంఘంలో సభ్యురాలుగా కొనసాగుతోంది. డ్వాక్రా సంఘంలో రుణం తీసుకుని భర్తకు వాయిదాల పద్ధతిలో టెంపో వాహనం కొనుగోలు చేసి ఇచ్చింది. అయితే ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఫైనాన్స్ లోను, డ్వాక్రా రుణం చెల్లించడంలోనూ కొంతకాలంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ ఉన్నారు. ఈ క్రమంలో కర్ణాటక ముల్‌బాగల్ లో ఉంటున్న లత సోదరి, బావ ఇటీవల అనారోగ్య కారణాలతో మృతి చెందారు. దీంతో వారి కుమార్తె అనాథగా మారింది. ఆ బాలికను తెచ్చి పెంచుకుందామని లత తన భర్త గణేష్ బాబును కోరింది. ముల్ బాగల్ వెళ్లి బాలికను ఇంటికి తీసుకురావాల్సిందిగా చెప్పింది. పనుల ఒత్తిడి కారణంగా గణేష్ బాబు వెళ్లకపోవడంతో, శుక్రవారం రాత్రి ఇదే విషయమై భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. అనంతరం గణేష్ బాబు జమున ఒక గదిలో నిద్రించగా లత మరో గదిలోకి వెళ్ళి కుటుంబ సభ్యులు నిద్రించాక గదిలోని రాడ్‌కు చీరతో ఉరి వేసుకుని మృతి చెందింది. ఉదయం నిద్ర లేచిన కుటుంబ సభ్యులు లత ఉరికి వేలాడుతుండగా గమనించి, స్థానికుల సాయంతో మృతదేహాన్ని కిందికి దించారు. తాలూకా పోలీసులకు సమాచారం అందించారు. సీఐ కళావెంకటరమణ ఏఎస్ఐ సుబ్రహ్మణ్యం సంఘటన స్థలానికి చేరుకుని లత మతికి గల కారణాలను కుటుంబ సభ్యులను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. మృతురాలి పెద్ద కుమార్తె పరిమళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఏఎస్ఐ సుబ్రహ్మణ్యం దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బార్ అసోసియేషన్ ఎన్నికలకు 17 నామినేషన్‌లు



మద్దతుదారులతో కలసి నామినేషన్ దాఖలు చేస్తున్న టి.ఈశ్వర్

రాయచోటి అర్బన్ : రాయచోటి బార్ అసోసియేషన్‌కు ఈనెల 29న జరుగనున్న ఎన్నికల బరిలో నిలిచేందుకు 17 మంది నామినేషన్‌లు దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారి రాజకుమార్ రాజు, సహాయ ఎన్నికల అధికారి ఇలియాస్‌బేగ్ శనివారం తెలిపారు. బార్ అసోసియేషన్ కార్యవర్గంలోని 7 పోస్టులకుగాను 17 నామినేషన్లు దాఖలైనట్లు చెప్పారు. నామినేషన్‌ల దాఖలు గడువు ముగిసే సమయానికి అధ్యక్ష పదవికి ఎస్.ప్రభాకరరెడ్డి, వై.రమేష్‌రెడ్డి, ఉపాధ్యక్ష పదవికి టి.ఈశ్వర్, ధనుంజయ కుమార్, ఎంఎల్ రామచంద్రారెడ్డి, వై.రామమోహన్‌రెడ్డి నామినేషన్‌లు దాఖలు చేశారన్నారు. జనరల్ సెక్రటరీగా పి.రెడ్డిబాషా, పి.శ్రీనివాసులు, సహాయ కార్యదర్శికి నాగముని, ఎం.వి.,రమణ, రామ్‌కుమార్‌లు, కోశాధి కారిగా ఆదిరెడ్డి నాయక్, నాగరాజులు, లైబ్రరీ సెక్రటరీకి వి.సిద్దయ్య, కె.బాలచంద్రలు, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ టివి రమణ, డి.రామకుమార్ నామినేషన్‌లు వేసినట్లు తెలిపారు. ఈనెల 24న నామినేషన్ల పరిశీలన, 25న ఉపసంహరణ, 29న ఎన్నికల నిర్వహణ, అదే రోజున ఎన్నికల ఫలితంపై ప్రకటన ఉంటుందని తెలిపారు.

పెళ్లికి పిలవడానికి వచ్చి చోరీ

ఎర్రగుంట్ల : పట్టణంలోని 12వ వార్డులో నివాసం ఉండే మహబూబీని పెళ్లికి పిలవడానికి వచ్చి ఆమె చేతికి ఉన్న బంగారు ఉంగరాన్ని చోరీ చేసిన కేసులో నిందితుడు కొత్తపల్లి ఖాసీంపీరాను అరెస్టు చేసినట్లు సీఐ నరేష్‌బాబు తెలిపారు. శనివారం కేసు వివరాలను సీఐ వెల్లడించారు. ఖాజీపేట గ్రామంలోని బీసీ కాలనీకి చెందిన ఖాసీంపీరా చెడు వ్యసనాలకు లోనై అప్పులు చేశాడు. ఇతను చాలా ఏళ్లుగా మట్కా బెట్టింగ్, అప్పులు అధికంగా చేశాడు. ఎలాగైన తెచ్చిన అప్పులు కట్టడం కోసం అడ్డ దారిలో డబ్బు కోసం ముసలి వారిని టార్గెట్ చేసుకున్నాడు. వారితో పరిచయం చేసుకుంటూ మాయ మాటలు చెప్పి వారి వద్ద నుంచి బంగారు వస్తువులు, డబ్బులు లాక్కుని పారిపోతుంటాడని చెప్పారు. ఇలా ఖాసీంపీరాపై పలు కేసులు ఉన్నాయన్నారు. ఈ తరుణంలో ఈ నెల 9వ తేదీన కడప పాత బస్టాండ్ దగ్గర నుంచి ఆటో తీసుకుని వల్లూరు, కమలాపురం, ఎర్రగుంట్లకు వచ్చాడు. యర్రగుంట్ల పట్టణంలోని పోలీస్‌స్టేషన్ వెనుక ఉన్న మహబూబీ అనే వృద్ధురాలి వద్దకు వెళ్లి నిద్రలేపాడు. నేను మీ కోడలి బంధువు అని నమ్మించాడు. మా పాపాకు పెళ్లి చేస్తున్నాం.. అందరూ పెళ్లికి రావాలన్నాడు. పెళ్లి కూతురికి మీ చేతికి ఉన్న ఉంగరంను అదే సైజులో చేయించాలి. మీ ఉంగరం ఇస్తే బయట ఆటోలు కూర్చొని ఉన్న వారికి చూపించి వస్తాను అని చెప్పాడు. దీంతో మహబూబీ నమ్మి చేతికి ఉన్న బంగారు ఉంగరం తీసి ఇచ్చింది. ఆ ఉంగరం తీసుకొని ఖాసీంపీరా అక్కడ నుంచి ఉడాయించాడు. దీంతో బాధితురాలు మహబూబీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని ఖాసింపీరాను ఎర్రగుంట్లలో అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

వేంపల్లె సబ్ రిజిస్ట్రార్‌పై చర్యలు చేపట్టాలి

– ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌ను సస్పెండ్ చేసిన ఉన్నతాధికారులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న వేంపల్లె ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ ఈశ్వరయ్యపై సత్వరమే చర్యలు చేపట్టాలని వేంపల్లె టీడీపీ నాయకుడు శేషయ్యతో పాటు కార్యాలయ పరిధిలోని ఆయా గ్రామాల ప్రజలు నాగసుబ్బారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, శిధర్‌రెడ్డి, శేషారెడ్డి, వెంకటేష్, రాజశేఖర్‌రెడ్డి, నాగేష్‌రెడ్డి, గంగయ్య, వాసుదేవారెడ్డి తదితరులు కోరారు. ఈ మేరకు వారు శనివారం కడపలోని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌శాఖ డీఐజీ వీఎస్ఆర్ ప్రసాద్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ అభ్యర్థన మేరకు వేంపల్లె ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌పై చర్యలు తీసుకునేందుకు డీఐజీ హామీ ఇవ్వడంపై ఆయనకు ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. సబ్ రిజిస్ట్రార్ అవినీతికి అంతే లేకుండా పోతోందన్నారు. ఇతనిపై గతంలో కూడా ఫిర్యాదు చేయగా, విచారణలు సైతం జరిగాయన్నారు. వేంపల్లె సబ్ రిజిస్ట్రార్‌పై డీఐజీ చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఉద్యమించాల్సి వస్తుందని వారు హెచ్చరించారు. ఈ నేపథ్యంలో జిల్లా రిజిస్ట్రార్ పీవీఎన్ బాబును సంప్రదించగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వేంపల్లె ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌ను సస్పెండ్ చేసినట్లు తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

కొండాపురం : మండల పరిధిలోని వెంకటాపురం గ్రామ సమీపంలోని కడప–తాడిపత్రి జాతీయ రహదారిపై శనివారం ట్రాక్టర్ ట్రాలీని టిప్పర్ ఢీకొంది. ప్రమాదంలో ముగ్గురు మహిళలు గాయపడ్డారు. స్థానికుల వివరాల మేరకు.. ముద్దనూరు నుంచి తాడిపత్రి వరకు చేపట్టిన నాలుగు వరుసల రోడ్డు నిర్మాణ పనులు కోసం వచ్చిన మహిళా కూలీలు వెంకటాపురం వద్ద ట్రాక్టర్ ట్రాలీ నుంచి దిగుతుండగా తాడిపత్రి వైపు వెళ్లే టిప్పర్ ఢీ కొంది. మహిళలు శివమ్మ, రమాదేవి, భవాని గాయపడ్డారు. వారిని తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.